

నేడు ఆవిష్కరణ

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29 :రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకావిష్కరణ సభకు ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయిత్రి ఓల్గా పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ఎమెస్కో సంపాదకుడు డి. చంద్రశేఖరరెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తారు. ముఖ్య అతిథులుగా సీనియర్ పాత్రికేయులు మానుకొండ నాగేశ్వరరావు, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు పాల్గొంటారు.



వేదిక : అమరరాజ ఆడిటోరియం, కరకంబాడి
సమయం : శుక్రవారం ఉదయం 10 గంటలకు

తెలుగు రాజకీయాల అంతరాత్మ కథ

గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర

ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య, సేవా రంగాల చరిత్రలో ఎన్నటికీ చెరగని పేరు పాటూరి రాజగోపాలనాయుడు. నిరాడంబరత, సేవాదృక్పథం, ఓరిమిగల రాజకీయం, గురుభక్తి, స్నేహశీలత వంటి ఉన్నత గుణాల సమాహారం ఆయన. పసి వయసునుంచే ఆయన చేయి పట్టుకుని నడిచిన తల్లిలేని బిడ్డ గల్లా అరుణకుమారి. పీయూసీతో ఆగిపోయిన చదువును, పెండ్లై భర్త రామచంద్రనాయుడు వెంట అమెరికా వెళ్లిన తర్వాత ఆమె కొనసాగించారు. నలభై ఏళ్ల కిందటే అమెరికాలో కంప్యూటర్స్ కోర్సు చేసి, ప్రసిద్ధ కార్ల కంపెనీలో తొమ్మిదేళ్లకు పైగా ఉద్యోగం చేశారు.పుట్టిన నేల మీద ఫ్యాక్టరీ పెట్టాలనే రామచంద్రనాయుడు ఆలోచనలకు బాసటగా భర్తతో కలిసి తిరిగి వచ్చిన అరుణకుమారి అనుకోని పరిస్థితుల్లో పూర్తి ప్రతికూల వాతావరణంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇక అక్కడి నుంచీ ఆమెది పోరాటమే. ప్రత్యర్థి పార్టీతో మాత్రమే కాదు, సొంత పార్టీలోనూ ఆమె తలపడక తప్పని పరిస్థితులనే ఎదుర్కొన్నారు.ఈ పరిణామాలన్నింటినీ గల్లా అరుణకుమారి అక్షరమక్షరం గుదిగుచ్చి స్వీయచరిత్రగా లిఖించారు. వెయ్యి పేజీల ఈ పుస్తకం నేడు తిరుపతిలో విడుదల అవుతోంది. వేలాదికోట్ల వ్యాపార సామ్రాజ్యంగా విస్తరించినా దిగువ మాఘం పల్లెబిడ్డగానే ఇప్పటికీ ఆమె మాటా, తీరూ ఉండడం విశేషం. పదహారేళ్లు అమెరికాలో ఉన్నా, ఇరవై ఏళ్లు ఎమ్మెల్యేగా, మూడు పర్యాయాలు మంత్రిగా చేసినా ఆమె గొంతులో ఇప్పటికీ చిత్తూరు యాస సొగసుగానే పలుకుతుంది.భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించడానికి సరిగ్గా పదహైదు రోజుల ముందు పుట్టిన గల్లా అరుణకుమారి తల్లి కూడా పోరాట యోధురాలే. తెల్ల దొరలపై తిరుగుబాటుగా భర్త రాజగోపాలనాయుడు నడిపిన రాత పత్రికను ఆయన అరెస్టు తర్వాత కొనసాగించిన ధీరురాలు. నిండు చూలాలుగా జైలు శిక్ష అనుభవించి జబ్బుపడి విడుదలై బిడ్డను కన్న కొద్ది కాలానికే కన్నుమూసిన అమరావతి జ్ఞాపకాలను కడుపులో దాచుకున్న కన్నీటితో తన స్వీయచరిత్రలో నమోదు చేశారు అరుణకుమారి. రాజీవ్ గాంధీ నుంచి రాజకుమారి దాకా నిలదీసే స్వభావమే ఆమెను రాజకీయాల్లో నిరంతరం అస్థిరంగా ఉంచిందని ఈ పుస్తకం వెల్లడిస్తోంది. చిత్తూరు జిల్లాలో వివిధ ఎన్నికల్లో గ్రామాల్లో ఎదురైన సంఘటనలనూ, అప్పటి మనుషులనూ మరచిపోకుండా తన స్వీయచరిత్రలో ఆమె గుర్తు చేసుకున్నారు. కోట్ల విజయభాస్కరరెడ్డితో, వైఎస్ రాజశేఖరరెడ్డితో, చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డి, చంద్రబాబు సహా పలువురు నాయకులతో విభేదించిన సందర్భాలనూ, వారి అభిమానం చూరగొన్న సమయాలనూ ఆమె రాశారు. తెలుగునేల మీద నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన రాజకీయాల ఆత్మగుట్టు విప్పి చెప్పారు అరుణకుమారి. సరళంగా కథలా సాగే గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర విడుదలయ్యాక వర్తమాన రాజకీయ నాయకులకు ఒక పాఠంగా ఉపయోగపడుతుంది.



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కొలిక్కి వచ్చిన విచారణ!

కుప్పం, ఆగస్టు 29: కుప్పం రెస్కోలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సాగుతున్న విచారణ ఒక కొలిక్కి వచ్చినట్లు విచారణాధికారి అయిన సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి తెలిపారు. పదీ పదిహేను రోజుల్లో విచారణ పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. తదుపరి బాధ్యులపై చర్యలు ఉంటాయని చెప్పారు. కుప్పం రెస్కోలో గురువారం ఆమె విచారణ చేపట్టారు. రెస్కో సిబ్బంది ఒక్కొక్కరితో మాట్లాడుతూ.. వారిపై వచ్చిన ఆరోపణలపై వివరణ కోరారు. వారు చెప్పిన అంశాలను నోట్ చేసుకున్నారు. ఇక, రెస్కోలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, షణ్ముగం అనే వ్యక్తి ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. వీరిలో పి.మనోహర్‌తో శ్రీలక్ష్మి భేటీ అయ్యారు. ఆయన ఫిర్యాదు చేసిన అంశాలపై విచారించారు. ఆయా ఫిర్యాదులకు సంబంధించి ఆధారాలు సేకరించారు. మరో ఫిర్యాదుదారుడైన షణ్ముగం విచారణకు హాజరు కాలేదు. తొలినుంచీ ఆయన విచారణకు దూరంగానే ఉంటున్నారు. ఇప్పటికి మూడుసార్లు ఆయనకు నోటీసులు వెళ్లినా స్పందన లేదు. ఈ నేపథ్యంలో తొలుత ఫిర్యాదు చేసిన వ్యక్తి విచారణకు హాజరు కాకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. నిజానికి నోటీసులకు స్పందించి, ఫిర్యాదులకు సంబంధించి తగిన ఆధారాలు ఇవ్వని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు పంపిన నోటీసుల్లో అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. అయినా సరే, షణ్ముగం విచారణకు రాకపోవడం, అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరించడం అనుమానాలకు ఆస్కారం కలిగిస్తోంది.

ఫిర్యాదు చేసిన అంశాలపైనే విచారణ

ఇద్దరు ఫిర్యాదుదారులు చేసిన అంశాలపైనే విచారణ జరుపుతున్నట్లు సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి తెలిపారు. రెస్కోలో జరిగిన అక్రమాలపై విచారణకు వచ్చిన ఆమె, తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. తన విచారణకు సమాంతరంగా సాంకేతిక అంశాలపై ట్రాన్స్‌కో విజిలెన్స్ విచారణ కొనసాగుతోందన్నారు. అక్రమ నియామకాలకు సంబంధించి నోటీసులు జారీ చేసిన 115 మంది ఉద్యోగుల్లో 17 మంది టీడీపీ ప్రభుత్వ హయాంలో చేరిన వారు. వీరినీ మిగిలినవారితో సమానంగా పరిగణించి నోటీసులు జారీ కావడంపై వివరణ కోరగా.. ఆ విషయం తనకు తెలియదని ఆమె చెప్పారు. ఇప్పుడు తన దృష్టికి వచ్చింది కాబట్టి విచారించి చేపట్టాల్సిన చర్యల గురించి ఆలోచిస్తామన్నారు. 2022లో వైసీపీ ప్రభుత్వం ఎగ్జింప్షన్ ఫ్రమ్ లైసెన్సీని రెస్కోకు అప్రూవ్ చేయడం మానేయడంతో సబ్సిడీ లేకుండా ఎస్పీడీసీఎల్‌నుంచి విద్యుత్తును రెస్కో కొనసాలి వస్తోంది. ఈ క్రమంలో రెస్కోకు లైసెన్స్ ఇచ్చే అవకాశం ఉందా అని అడగ్గా.. ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు. చీపురుపల్లి, అనకాపల్లి రెస్కోలు దాదాపు ఎస్పీడీసీఎల్‌లో విలీనం అయ్యాయని, కుప్పం రెస్కోపై ఇంకా ఎటువంటి నిర్ణయమూ ప్రభుత్వం తీసుకోలేదని తెలిపారు.


రెస్కో సిబ్బందిని విచారిస్తున్న కో ఆపరేటివ్ అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీదేవి

> అక్రమాల బాధ్యులపై త్వరలోనే చర్యలు

> రెస్కో విచారణాధికారి, అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి

> ఫిర్యాదుదారుడు సీఎం చంద్రబాబు పీఏ మనోహర్‌తో భేటీ

> హాజరు కాని మరో ఫిర్యాదుదారు షణ్ముగం

పరిమితం ఎందుకో?

ఫిర్యాదుదారులు పేర్కొన్న అంశాలతోపాటు ఇంకా పలు అక్రమాలు రెస్కోలో చోటు చేసుకున్నాయి. అధికార దుర్వినియోగం తారస్థాయిలో జరిగింది. ఆయా అంశాలపై ఇప్పటికే మీడియాలో, ముఖ్యంగా ఆంధ్రజ్యోతిలో పలు వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి. అయినా సరే, కేవలం ఫిర్యాదారులు పేర్కొన్న అంశాలవరకే విచారణను ఎందుకు పరిమితం చేస్తున్నారో తెలియడం లేదు. నిజానికి విచారణాధికారి 30 అంశాలకు సంబంధించిన ఫైళ్లను తనకు సమర్పించాల్సిందిగా మొదట్లో రెస్కో అధికారులను ఆదేశించారు. ఇప్పటికి మూడుసార్లు రెస్కోకు నేరుగా వచ్చి సిబ్బందిని విచారించారు.

ఒక రోజు ముందే

● రేపు సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 29: సెప్టెంబరు ఒకటో తేది ఆదివారం. సెలవు దినం. అందుకని ఒక రోజు ముందే.. ఆగస్టు 31వ తేదీనే ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద శనివారం సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి బ్యాంకులకు చేరిన నగదు మొత్తాలను సచివాలయ ఉద్యోగులు శుక్రవారం విత్‌డ్రా చేయనున్నారు. శనివారం ఉదయం నుంచే ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు సోమవారం అందజేయనున్నారు.

చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రసాద్

● పుంగనూరు కమిషనర్ నరసింహప్రసాద్ బదిలీ
● నగరి కమిషనర్‌గా కృష్ణారెడ్డి

చిత్తూరు,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలో అధికారులను బదిలీ చేస్తూ ఆశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్‌సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో కొందరు బదిలీ కాగా, మరికొందరు వచ్చారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రసాద్ నియమితులయ్యారు. మున్సిపల్ శాఖలో కేటగిరీ 3 మేనేజర్ అయిన ఈయన ప్రస్తుతం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. చిత్తూరులో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పోస్టులోకి రానున్నారు. పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. ఈయన స్థానంలోకి ధర్మవరం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డి రానున్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేవీ కృష్ణారెడ్డి నగరి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నగరి ప్రస్తుత కమిషనర్ మంజునాథ్ గౌడ్ తన ఒరిజినల్ పోస్టు అయినటువంటి నందికొట్కూరు మున్సిపాలిటీ మేనేజర్‌గా వెళ్లనున్నారు.

ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చేసి

● రూ.86 వేలు విత్‌డ్రా చేసేసిన నిందితుడు

కల్లూరు, ఆగస్టు 29: ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసే ప్రక్రియలో ఉన్న వ్యక్తిని ఏమార్చాడు. ఏటీఎం కార్డు మార్చేశాడు. రూ.86 వేల నగదు విత్‌డ్రా చేశాడు. పులిచెర్ల మండలం కల్లూరులో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజారెడ్డి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు పంచాయతీ కట్టకిందపల్లికి చెందిన గురుమూర్తినాయుడు ఈనెల 22వ తేది ఉదయం సుమారు 10 గంటల సమయంలో నగదు డ్రా చేసుకునేందుకు సదుం రోడ్డులోని కల్లూరు ఇండియన్ బ్యాంకు ఏటీఎం వద్దకు వచ్చారు. ఏటీఎం మిషన్‌లో కార్డు పెట్టి పిన్ నెంబరు కొట్టి మిగిలిన ప్రక్రియ జరుగుతున్న క్రమంలో వెనుకనే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఆయన్ను ఏమార్చి.. ఆ కార్డును మార్చేశాడు. దీన్ని గుర్తించని గురుమూర్తినాయుడు నగదు రాకపోవడంతో డ్రా చేసే ప్రక్రియను తిరిగి చేపట్టారు. అయినా నగదు రాకపోవడంతో మిషన్‌లోని ఏటీఎం కార్డును తీసుకొని వెళ్లిపోయారు. కానీ, నగదు డ్రా అయినట్లు మెసేజీలు రావడంతో ఆయన ఇండియన్ బ్యాంకుకు వెళ్లి విచారించారు. మీ ఖాతా నుంచి రూ.86 వేలు నగదు డ్రా అయినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. బ్యాంకు సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు పీలేరు పెట్రోల్ బంకులో స్వైప్ మిషన్ ద్వారా నగదు డ్రా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు గురుమూర్తినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.


ఏటీఎంలో నగదు డ్రా చేస్తున్న క్రమంలో కార్డు మార్చేసిన దుండగుడు (వృత్తంలోని వ్యక్తి)

పోలీసులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్


గ్రీవెన్స్‌లో ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 29: జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీసులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఎస్పీ మణికంఠ హాజరై పోలీసు సిబ్బంది సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించారు. బదిలీలు, సస్పెన్షన్ రీవోక్, సరెండర్ లీవ్, ఇంక్రిమెంట్లు, ఇతరత్రా సమస్యలపై వినతులు వచ్చాయి. వెంటనే పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సస్పెన్షన్ రీవోక్, ఇంక్రిమెంట్లు వంటి అంశాల్లో న్యాయం చేస్తామని, త్వరలోనే బదిలీల ప్రక్రియ చేపడతామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 29: చిత్తూరులో శుక్రవారం జరగాల్సిన వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న పలమనేరు బాలాజి విజయలక్ష్మి

తెలుగు భాషా పురస్కారాల ప్రదానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు)/పలమనేరు, ఆగస్టు29 : తెలుగు భాషా సాహిత్య రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు ప్రముఖులను రాష్ట్రప్రభుత్వం తెలుగు భాషా పురస్కారాలతో సత్కరించింది.విజయవాడలోని తుమ్మలపల్లె కళా క్షేత్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు.వీరిలో తిరుపతిలోని మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విశ్రాంతాచార్యులు మూలె విజయలక్ష్మి, చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు బాలాజి వున్నారు.30 ఏళ్ళ తెలుగు భాషా సాహిత్య బోధనలో 28 పీహెచ్‌డీలు, 7ఎంఫిల్ డిగ్రీలకు ఆచార్య విజయలక్ష్మి పర్యవేక్షకురాలిగా వ్యవహరించారు.14 పుస్తకాలు,108 పరిశోధనా వ్యాసాలు రాశారు.పలమనేరుకు చెందిన బాలాజీ కవిత్వం, కథ, విమర్శ రంగాల్లో కృషి చేశారు.ఇప్పటిదాకా ఆయన రచనలు ఆరు పుస్తకాలుగా వెలువడ్డాయి.కొన్ని కథలు,కవితలు కన్నడ,తమిళ, ఆంగ్ల భాషల్లో అనువాదమయ్యాయి.

తెలుగు భాషకు జేజేలు



కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో..

గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వాడుక భాషలోనే రచనలు చేయాలని, శాస్త్ర సాంకేతికత సామాన్యులకు చేరాలని గిడుగు చేసిన ఉద్యమాన్ని విద్యార్థులకు వివరించారు. పలుచోట్ల విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా ప్రదర్శనలు నిర్వహించారు. అమ్మ భాషకు పట్టం కట్టాలని పలువురు పిలుపునిచ్చారు.

- చిత్తూరు (సెంట్రల్)

ఆటలాడుదాం



కార్వేటినగరం మండలం డీఎంపురంలో పిరమిడ్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

చదువుతో పాటు విద్యార్థులు ఆటల్లోనూ ఉత్సాహంగా పాల్గొనాలని పలువురు పిలుపునిచ్చారు. భారత హాకీ శిఖరం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. పలు చోట్ల క్రీడాకారులు ర్యాలీలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. - చిత్తూరు క్రీడలు

అఘాయిత్యాలు ఆపండి



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరసిస్తూ బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హత్యాచారాలు, వేధింపులు ఆపాలంటూ ప్లకార్డులను చూపుతూ నినదించారు.

- బంగారుపాళ్యం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● రూ.8.5 లక్షల బంగారు, వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు, ఆగస్టు 29: తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను ఒకటో పట్టణ సీఐ జయరామయ్యతో కలిసి డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. ఈనెల 15వ తేదీన చిత్తూరు నగరం కట్టమంచికి చెందిన మునికృష్ణ ఇంట్లో తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన నసీమ్ నబి(25), పాత ఢిల్లీకి చెందిన జనసీర పఠాన్(34)లను వారివారి రాష్ట్రాల్లో పట్టుకుని ఢిల్లీ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం చిత్తూరుకు తీసుకొచ్చి వారి నుంచి రూ.8.50 లక్షల విలువ చేసే 140 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఏఎస్ఐ త్యాగరాజు, కానిస్టేబుళ్లు సురేష్‌బాబు, సుధాకర్, జనార్దన్, రమేష్, రేణు, వాసులను డీఎస్పీ అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ఆర్ఎంపీకి హెచ్చరికలు చేస్తున్న జిల్లా వైద్యాధికారుల బృందం

పలమనేరు, ఆగస్టు 29: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆర్ఎంపీలను జిల్లా వైద్యాధికారులు హెచ్చరించారు. పట్టణంలోని పాతపేట శ్రీనివాస క్లినిక్‌లో ఒక ఆర్ఎంపీ వేసిన సూది మందు కారణంగా ఇంటర్ విద్యార్థిని తేజశ్రీ రెండు రోజుల క్రితం మరణించిన విషయం విదితమే. ఈ సంఘటనతో జిల్లా వైద్యాధికారులు ఆర్ఎంపీల వైద్యంపై దృష్టి సారించారు. పలమనేరులో గురువారం ఆర్ఎంపీలు నడుపుతున్న క్లినిక్‌లను జిల్లా వైద్యబృందం సందర్శించింది. పలు క్లినిక్‌లలో సూదిమందులు, వినియోగించిన సూదులు, మందులను అధికారులు కనుగొన్నారు. కొన్ని క్లినిక్‌లలో పడకలు కూడా ఉండటాన్ని గుర్తించారు. ఇకపై సూదులు వేసినా, చీటి మందులు రాసిచ్చినా, క్లినిక్‌లలో సెలైన్లు పెట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు, జిల్లా విస్తరణ అధికారి జయరాం, మెడికల్ ఆఫీసర్ నిరంజన్ కుమార్, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్‌బాబు పాల్గొన్నారు. కాగా తనిఖీల నేపథ్యంలో కొందరు ఆర్ఎంపీలు క్లినిక్‌లను మూసేసి వెళ్లిపోయారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎంపీ



షరణ్‌ను అభినందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల

చిత్తూరు రూరల్, ఆగస్టు 29: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. గురువారం చిత్తూరు మెసానికల్ మైదానంలో జరిగిన జాతీయ క్రీడాదినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థల ద్వారా జిల్లాకు అవసరమైన కోచ్‌లను తీసుకొస్తామన్నారు. అనంతరం హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీఎస్ఏ మైదానం నుంచి కలెక్టర్ బంగ్లా వరకు క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మద్దిపట్ల చంద్రశేఖర్, వాలీబాల్ అసోసియేషన్ నాయకులు జయప్రకాష్, డీఎస్‌డీవో బాలాజీ, పీడీ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే 21 నెలల వయసులో 21 నిమిషాల్లో 50 మీటర్ల పరుగును పూర్తి చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన బాలుడు షరణ్ గొరజాలను.. అతడిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు స్వరూప్, ప్రియాంకను ఎంపీ అభినందించారు.

నేడు జిల్లాలో వనమహోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 29: జిల్లాలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించనున్నట్లు డీఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డి, ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు తూర్పు విభాగం చిత్తూరులోని నగరవనంలో జరిగే కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అరగొండలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీ మోహన్ పాల్గొననున్నట్లు తెలిపారు.

తెలుగు భాష గొప్పతనాన్ని లోకానికి చాటింది గిడుగు

గుడుపల్లె, ఆగస్టు 29: తెలుగు భాష గొప్పతనాన్ని లోకానికి చాటి చెప్పింది భాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి అని ఇన్‌చార్జి వీసీ దొరస్వామి పేర్కొన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ఎమినో భవనం సెమినార్ హాలులో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కందుకూరి సంఘ సంస్కరణకు పూనుకుంటే.. గురుజాడ ఆధునిక సరళ సాహిత్యపు భాషకు పునాదులు వేశారని.. గిడుగు ప్రజల వ్యవహారిక భాషోద్యమానికి ఊతమై నిలిచి సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానాన్ని అందుకొన్నారని వివరించారు. ద్రావిడ వర్సిటీలో ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వీసీ తెలిపారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆంగ్ల వ్యామోహంలో పడి తెలుగు భాషను మరచిపోతున్నామని, భాషాభివృద్ధికి అందరు కలిసి కట్టుగా పాటు పడాలన్నారు. మన సంస్కృతి గొప్ప దనాన్ని, తెలుగు ఔన్నత్యాన్ని అకాడమిక్ డీన్ ఆచార్య శ్యామల వివరించారు. ఈ సందర్భంగా గిడిగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం





కుప్పంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు, ఫిర్యాదుల రిజిస్ట్రేషన్‌కు క్యూలో కిక్కిరిసిన ప్రజలు

కుప్పం, ఆగస్టు 29: ప్రజా ఫిర్యాదుల వేదికలో చేసుకున్న ఫిర్యాదులకు సత్వర పరిష్కారం లభించేందుకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పంలోని మండల సచివాలయంలో గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ శాఖ ఇక్కడ వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. కాగా కలెక్టర్‌కు సమస్యల గురించి విన్నవించుకోవడానికి ప్రజలు తండోపతండాలుగా క్యూ కట్టారు. నిజానికి ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే వినతుల స్వీకరణకు గడువు విధించారు. అయితే ప్రజలు లెక్కకు మిక్కిలి రావడంతో పాటు క్యూలో నిలుచుకోవడంతో మధ్యాహ్నం మూడు గంటలదాకా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తూనే ఉన్నారు. ప్రజల నుంచి మొత్తం 257 ఫిర్యాదులు అందాయి. అందులో రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులే 151 ఉన్నాయి. సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు చెందిన ఫిర్యాదులు 31, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ 22, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ 13, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 6, సివిల్ సప్లయిస్ 5, పోలీస్, గ్రామీణ నీటి సరఫరా నాలుగేసి, ఎండోమెంట్స్ 3, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, ఎకనామిక్స్ అండ్ స్టాటిక్స్, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్ రెండేసి, ఏపీ డిఫరెంట్లీ ఏబుల్డ్ అండ్ సీనియర్ సిటిజెన్స్ అసిస్టెన్స్ కార్పొరేషన్, అగ్రికల్చర్, అనిమల్ హజ్బెండ్రీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్, రూరల్ డెవలప్‌మెంట్, వాటర్ రిసోర్సెస్, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు ప్రజలనుంచి అధికారులకు అందాయి.

ఈ కార్యక్రమంలో జేసీ విద్యాధరి, ఆర్డీవో శ్రీనివాసరాజు, డీఎస్పీ పార్థసారథి, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్.సురేశ్ బాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఐటీ నోటీసులు

రిటర్న్స్ దాఖలుకు రేపే చివరి రోజు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 29: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (సింగిల్ విండోలు) ఆదాయపన్ను శాఖ నోటీసులు ఇచ్చింది. ఐటీ స్లాబుల ప్రకారం పన్ను చెల్లించని సంఘాలకు తాకీదులు వచ్చాయి. ఏటా రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న కొన్ని సింగిల్ విండోలు మాత్రమే ఆదాయపన్ను చెల్లిస్తున్నాయి. చాలా సంఘాలు ఐటీ రిటర్న్స్ కూడా దాఖలు చేయడం లేదు. తగినంత ఆదాయం లేని సింగిల్ విండోలు పన్ను చెల్లింపులపై తటపటాయిస్తున్నాయి. సహకార చట్టం ప్రకారం సేవాదృక్పథంతో సంఘాలు నిర్వహిస్తున్నామంటూ, వాటి పర్సన్ ఇన్‌చార్జిలు పన్ను మినహాయింపు కోరుతున్నారు. దీంతో ఆదాయ మూలాల నుంచి పన్ను మినహాయింపు (టీడీఎస్) లెఖలు సమర్పించాలని ఆదాయపన్ను అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 37 సింగిల్ విండోలు కొనసాగుతున్నాయి. కాగా నాబార్డు ఆర్థిక సహాయంతో ఆప్కాబ్, డీసీసీబీల నుంచి రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు, ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగుల మందులు పంపిణీ చేస్తున్న సింగిల్ విండోలు ఆదాయపన్ను చెల్లించాలనడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎరువులు, పురుగుల మందులకు కంపెనీలు ఇచ్చే మార్జిన్ మనీ మాత్రమే సంఘాలకు ఆదాయంగా ఉంటుంది. రూ.లక్ష లోపు పంటరుణాలపై సంఘాలకు వడ్డీ రావడం లేదు. రూ.లక్ష పైన పంటరుణాలు, దీర్ఘకాలిక రుణాలకు మాత్రమే వడ్డీరూపంలో 1.25 శాతం ఆదాయం సింగిల్ విండోలకు లభిస్తుంది. దీంతో పాటు బంగారం కుదువ వ్యాపారం చేస్తున్నా వచ్చే ఆదాయం తక్కువ అని అధికారులు అంటున్నారు. ఇందులో సంఘాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు పోగా మిగిలిన సొమ్ము సింగిల్ విండోలకు డిపాజిట్‌గా ఉంటుంది. అయితే మొత్తం ఆదాయంపై పన్ను చెల్లిస్తే సంఘాలకు మిగిలేదేమి లేదని విండో అధికారులు అంటున్నారు. అందువల్ల లాభాలు తక్కువగా వున్న సింగిల్ విండోలకు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు విండోల కంప్యూటరీకరణ పూర్తికాకపోవడంతో అంతా మాన్యువల్ రికార్డులతోనే కార్యకలాపాలు సాగుతున్నందున ఆదాయ పన్నుశాఖ కోరిన సమాచారాన్ని ఇవ్వడం సిబ్బందికి తలనొప్పిగా మారుతోంది. వివిధ పనులతో సిబ్బంది బిజీగా ఉన్నందున నోటీసులు ఇచ్చి ఐటీ రిటర్న్స్ శనివారంలోగా దాఖలు చేయమనడంపై సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీసీవో నాగవర్ధన మాట్లాడుతూ ఇప్పటికే 37 సింగిల్ విండోలకు గాను 32 విండోలు ఐటీ రిటర్న్స్ ఇచ్చాయని, మిగిలిన ఐదు విండోలు శనివారం లోగా ఇవ్వాలని సంబంధిత సీఈవోలను ఆదేశించినట్లు తెలిపారు.

జ్వరంతో వచ్చి మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువుల ఆరోపణ ● మృతదేహంతో ఆస్పత్రి వద్ద నిరసన





అత్యవసర విభాగం వద్ద కవిత మృతదేహం, మృతురాలి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాద్

చిత్తూరు రూరల్, ఆగస్టు 29: జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన మహిళ మృతిచెందింది. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ మృతురాలి కుటుంబీకులు ఆరోపించారు. వివరాలిలా ఉన్నాయి. గంగాధర నెల్లూరు మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన కవిత(36) తీవ్ర జ్వరంతో గురువారం సాయంత్రం 6 గంటలకు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబీకులు ఆమెను చిత్తూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. తీసుకొచ్చిన రెండు గంటల సమయానికి ఆమె ఊపిరి ఆడక చనిపోయారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కవిత మృతి చెందినట్లు ఆమె కుటుంబీకులు అత్యవసర విభాగం ఎదుట మృతదేహాన్ని ఉంచి నిరసన చేపట్టారు. ఈ విషయాన్ని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు వారు సమాచారం ఇవ్వడంతో.. ఆయన అనుచరులు వచ్చారు. ఘటనపై వైద్యులను ఆరా తీశారు. తక్షణం ప్రాథమిక చికిత్స అందించామని, ఊపిరితిత్తుల సమస్య కారణంగా చనిపోయినట్లు డాక్టర్లు వెల్లడించారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూ టౌన్ ఎస్ఐ ప్రసాద్ ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు.

డబ్బు కోసమే చంపేశారు

● పోలీసుల అదుపులో నిందితులు

చిత్తూరు, ఆగస్టు 29: చిత్తూరు నగరంలో బుధవారం హత్యకు గురైన వ్యక్తిని డబ్బు కోసమే ముగ్గురు వ్యక్తులు కొట్టి చంపేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు చెప్పిన వివరాల మేరకు.. బంగారుపాళ్యంకు చెందిన దావూద్‌బాషా బుధవారం నగరంలోని ఓ మద్యం షాపులో మద్యం తాగి బయటకు వచ్చాడు. అక్కడే ఉన్న నగరంలోని తోటపాళ్యంకు చెందిన రాజేష్, మణికంఠ, అనంతపురం జిల్లాకు చెందిన కార్తీక్ అతన్ని డబ్బులు ఇవ్వమని బెదించారు. నిరాకరించడంతో కొట్టుకుంటూ సంతపేట వీరభద్రకాలనీ రోడ్డుకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి దావూద్‌బాషా భార్యకు ఫోన్ చేసి రూ.20వేలు తీసుకురావాలని, లేకపోతే భర్తను చంపేస్తామని బెదిరించారు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో తాగిన మైకంలో ఉన్న ఆ ముగ్గురు పక్కనే ఉన్న బండరాయితో దావూద్‌బాషాను కొట్టి చంపేసి పారిపోయారు. పోలీసులు విచారణ చేపట్టి రాజేష్, మణికంఠ, కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశముంది.

డీవీఎంసీ సభ్యుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 29: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో కొత్త సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో ఐదుగురు ఎస్సీ, ఎస్టీలు, ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల (ఎస్సీ, ఎస్టీలు కాకుండా) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాల అభ్యున్నతి కోసం పనిచేసివారై ఉండాలని వివరించారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, పౌరహక్కుల చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇదివరకు చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, తగిన ఆధారాలతో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి, న్యూ కలెక్టరేట్ కార్యాలయం, చిత్తూరు అనే చిరునామాకు సెప్టెంబర్ 9లోపు దరఖాస్తులు అందించాలని తెలిపారు.

టీటీడీకి విరాళంగా వాహనం



తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి గురువారం ఉదయం టాటా సంస్థకు చెందిన ఓ రవాణా వాహనం విరాళంగా అందింది. రూ.10 లక్షల విలువైన టాటా యోధ 1700 బీఎస్‌వీఐ రవాణా వాహనాన్ని పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి అందజేశారు. ఈమేరకు గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. కర్ణాటక ఎమ్మెల్యే గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం కార్యక్రమానికి

ముఖం చాటేసిన వైసీపీ నేతలు

పాలసముద్రం, ఆగస్టు 29: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కార్యక్రమానికి పలువురు వైసీపీ నేతలు ముఖం చాటేశారు. పాలసముద్రం మండలం క్రిష్ణజిమ్మాపురంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో గురువారం జరిగిన నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తాను వస్తున్నట్లు నాయకులందరికీ ఆయన బుధవారం ఫోన్లు చేసి పిలిచారు. అయినా, మండల అధ్యక్షురాలు శ్యామల, ఆమె భర్త, వైసీపీ నేత శివప్రకాష్ రాజు, మండల పార్టీ కన్వీనర్ తులసీరామ్ యాదవ్, నలుగురు ఎంపీటీసీలు, ఏడుగురు సర్పంచులు, పలువురు నాయకులు ఆయన కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. మండల వైసీపీలో వర్గవిభేదాలున్నాయి. ఇక, అధికారంలో ఉన్నప్పుడు నోటిదురుసుతో ప్రవర్తించిన నారాయణస్వామికి నాయకులు ముఖం చాటేసి ఇలా తమ నిరసన తెలిపారని చర్చ జరుగుతోంది.

స్విమ్స్‌లో రోగి అదృశ్యంపై పోలీసుల విచారణ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 29 :తిరుపతి స్విమ్స్ శ్రీపద్మావతి భవనంలోని ఎంఐసీయూ వార్డులో చికిత్స పొందుతూ కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప ఆచూకీ గురువారం కూడా లభించలేదు.అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్ప(65)కన్పించకపోవడంపై 'స్విమ్స్‌లో రోగి అదృశ్యం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన పోలీసులు, స్విమ్స్ యాజమాన్యం ఆస్పత్రి ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో గురువారం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. డైరెక్టర్ ఆర్వీకుమార్ బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోగి ఆచూకీ కోసం వెస్ట్ సీఐ రామకృష్ణ ఆయన బృందంతో కలిసి ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీతారమప్ప చికిత్స పొందుతున్న వార్డును పరిశీలించి అక్కడి సిబ్బందిని విచారించారు. స్విమ్స్ ఆవరణలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రి పరిసరాలతో పాటు బర్డ్, రుయా ఆస్పత్రి పరిసరాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే అదృశ్యమైన రోగి వృద్ధుడు కావడం, నాల్గవ అంతస్తు నుంచి కిందకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాటు బయటకు వెళితే కనీసం ఆ దృశ్యాలు కూడా సీసీ కెమెరాల్లో రికార్డు కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నట్లు స్విమ్స్ సిబ్బంది చెబుతున్నారు. స్విమ్స్‌లో పేషెంట్ సీతారామప్ప కన్పించకుండా పోవడానికి ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఎమ్మార్పీఎస్, బీసీ విద్యార్థి సంఘం నేతలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవడంతోపాటు తప్పిపోయిన రోగిని త్వరితగతిన కుటుంబసభ్యులకు అప్పగించాలని డిమాండు చేశారు.



స్విమ్స్‌లో బాధితులను అడిగి వివరాలు సేకరిస్తున్న సీఐ రామకృష్ణ

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఘనంగా తెలుగు భాష దినోత్సవం



తెలుగు భాష దినోత్సవం నిర్వహిస్తున్న అధ్యాపకులు

శాంతిపురం, ఆగస్టు 29 : మండల పరిధిలోని శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలుగు భాష దినోత్సవం విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో గిడుగు వెంకటరామూర్తి చిత్రపటానికి పూజలు చేసి నివాళర్పించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని, భాషను మనం కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా కుప్పం అభివృద్ధి

● మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఆగస్టు 29: పార్టీలకు కతీతంగా కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమెమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం స్థానిక మండల సచివాల యంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ అధ్యక్షతన మున్సిపల్ సమా వేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కంచర్ల మాట్లా డుతూ శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో రెండువేల పైచిలుకు ఎకరాలలో డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్, ఎయిర్ కనెక్టవిటీ, సెజ్ ఏర్పాటు జరుగుతుందన్నారు. ఇందుకోసం భూసేకరణ సర్వే కొనసాగు తోందన్నారు. తద్వారా 20 వేల నుంచి 30 వేల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉన్ననారు. కుప్పంలో కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు త్వరలోనే జరుగుతుందన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తామని చెప్పారు. వివిధ అభివృద్ధి పనుల అంచనాలతో రూపొందించిన ఎజెండాను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చదివి వినిపించారు. ఆయా పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది ఈ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు అవసరం



గంగవరం, ఆగస్టు29: ప్రతి విద్యార్థీ చదువుతో పాటు క్రీడలపై తప్పనిసరిగా పట్టుకలిగి ఉండాలని గంగవరం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రోహిణి పిలుపునిచ్చారు. గురువారం నేషనల్ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగవరం కేజీబీవీ విద్యార్థినులు క్రీడాకారుల చిత్రాలను ముగ్గులతో తయారుచేసి, క్రీడల ప్రాముఖ్యతపై ప్లకార్డులతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీఈటి తరుణమ్‌తాజ్, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

ఒకటిన మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పలమనేరు, ఆగస్టు29 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో సెప్టెంబరు 1వ తేదీ మధుమేహ వ్యాది గ్రస్తుల కోసం ప్రత్యేక ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబరంలో చెన్నె శంకరనేత్రాలయ నేత్రవైద్యులు మురళి పరీక్షలు జరిపి ఆపరేషన్లు అవసరమున్న వారిని గుర్తించి వారికి చెన్నె శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని వివరించారు. చెన్నె వెళ్లిరావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మధుమేహవ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు కథల పుస్తకాల పంపిణీ



పలమనేరు, ఆగస్టు29 : పలమనేరు, గంగవరం మండలాల్లోని పలు పాఠశాలల్లో గురువారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు విద్యార్థులకు తెలుగు పద్యాల పుస్తకాలు, కథల పుస్తకాలు, పెద్దబాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో తులసినాథంనాయుడును శాలువలతో సన్మానించారు.

వాహనాల వేలం.. రూ.3.82 లక్షల ఆదాయం



పలమనేరు, ఆగస్టు29: పలమనేరు ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద గురువారం వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన 29 వాహనాలకు అధికారులు వేలం పాటలు నిర్వహించారు. ఇందులో 23 ద్విచక్ర వాహనాలను విక్రయించారు. ఈ కార్యక్రమం లో చిత్తూరు ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ శ్రీధరరావు, పలమనేరు ఎస్‌ఈబీ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు అవసరం



ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కల్లూరు, ఆగస్టు 29: శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడు తాయని జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదలి, పాఠశాల హెచ్‌ఎంలు మంజువాణి, శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలంలోని కల్లూరు వీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, కావేటిగారిపల్లి, కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కావేటిగారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.25 వేలు విలువైన హాకీ క్రీడా సామగ్రిని పాఠశాల పూర్వ విద్యార్థి భానుప్రకాష్‌రెడ్డి వితరణగా అందజేశారు. వీఆర్ఆర్ కళాశాలలో క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

వైభవంగా ఊంజల్ సేవ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 29: హైరోడ్డు శ్రీకృష్ణ మందిరంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. చర్చివీధి రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలోనూ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

పుంగనూరు రూరల్, ఆగస్టు29: విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు అవసరమని పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని చంద్రమాకులపల్లె ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, కోకో తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటరమణరెడ్డి, శైలజ, మంజునాథ్, సుజాత, పీడీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు రూరల్, ఆగస్టు29: ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టిలు కోరారు. గురువారం పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో వారు మాట్లాడుతూ మండల, పట్టణ పరిధిలోని ఉద్యోగులు, అర్హత కలిగిన 10వ తరగతి ఓపెన్ స్కూల్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఓపెన్‌స్కూల్ కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్, హెచ్‌ఎం నకీర్‌ఉల్లాఖాన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జనసేన కార్యకర్త మృతి



కిరణ్ (ఫైల్)

పుంగనూరు రూరల్, ఆగస్టు29: అనార్యోగంతో జనసేన కార్యకర్త మృతిచెందాడు. మండలంలోని నల్ల గట్లపల్లె తాండాకు చెందిన భాణావత్‌కిరన్‌నాయక్(35) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. జనసేన నాయకులు పడగాల రమణ, విరూపాక్షి, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాగా మృతుడికి ఇద్దరు పిల్లలు కలరు.

రొంపిచెర్ల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



రొంపిచెర్ల,ఆగస్టు29: రొంపిచెర్ల ఎస్ఐగా గురువారం సుబ్బారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని వివరించారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న సుకుమార్ సెలవులో వెళ్లారు.

వైభవంగా కల్యాణోత్సవం



పలమనేరు, ఆగస్టు29 : పలమనేరు పాతపేటలో వెలసిన సంతాన వేణు గోపాలస్వామి ఆలయం లో గురువారం రాత్రి రుక్మిణీ, సత్యభామా సమేత వేణు గోపాలస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకుల వేదమం త్రోచ్ఛ రణల మధ్య నిర్వహించిన స్వామివారి కల్యాణోవాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజనాలబండకు రూ.199 లక్షల ఆదాయం

చౌడేపల్లె, ఆగస్టు29:సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ అంజనేయస్వామి ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.1.99 లక్షలు ఆదాయం చేకూరినట్లు ఏఈవో మునికృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది రాజనాలబండ తిరునాళ్ల నుంచి నేటి వరకు ఏడాదికి గాను భక్తులు హుండీ ద్వారా రూ.1,99,920ల కానుకలు సమర్పించినట్లు తెలిపారు.

రేపు ఓబులేశ్వరస్వామి కల్యాణోత్సవం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 29 : మండలంలోని మురారిపల్లె గ్రామంలోవున్న ఓబులేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు సాయంత్రం గరుడోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రత్యేక నేత్ర వైద్య శిబిరాలు విజయవంతం

● ఇప్పటిదాకా గుర్తించిన క్యాటరాక్ట్ కేసులు 724
● అవసరమైన అందరికీ ఆపరేషన్లు, కంటి అద్దాలు



కుప్పంలో జరిగిన నేత్ర వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఆగస్టు 29: కుప్పం నియోజకవర్గ పరిధిలో కంటి వెలుగు పథకం కింద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీనుంచి ఇప్పటిదాకా నిర్వహించిన ప్రత్యేక నేత్ర వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు అన్నారు. ఈ శిబిరాలలో ఇప్పటిదాకకా 724 క్యాటరాక్టు కేసులు గుర్తించామని, వీరందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి, అద్దాలు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. కుప్పంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన ప్రత్యేక నేత్ర వైద్య శిబిరానికి వారు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ నియోజక వర్గంలోని శాంతిపురం, రాళ్లబూదుగూరు, పైపాళ్యం, మల్లానూరు, విజలాపురం, వీర్నల గ్రామాలలో ఇప్పటిదాకా నేత్ర వైద్య శిబిరాల నిర్వహణ జరిగిందన్నారు. ఆయా శిబిరాలలో క్యాటరాక్టు సమస్యలున్న కేసులనే కాక, కంటి అద్దాలు అవసరమైన 2243 మందిని, సాధారణ కంటి సమస్యలున్న 845 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ అద్దాలు, మందులు ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు. సెప్టెంబరు 1న రామకుప్పం, 2న కంగుంది, ఎన్.కొత్తపల్లె, 3న గుడికొత్తూరు, గుడుపల్లెలో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కడా వీడీ వికాస్ మర్మత్, జేసీ విద్యాధరి, ఆర్డీవో శ్రీనివాసరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ నియోజకవర్గ విస్తరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ బీఆర్.సురేశ్ బాబు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పుతోనే గుండె పదిలం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ యశ్వంత్

కుప్పం, ఆగస్టు 29: జీవనశైలిలో మార్పు చేసుకుంటేనే గుండెకు రక్షణ దొరుకుతుందని కోలార్‌కు చెందిన ఆర్‌ఎల్‌జే నారాయణ హార్ట్ సెంటర్ హృద్రోగ నిపుణులు డాక్టర్ యశ్వంత్ అన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో 'జీవన శైలిలో మార్పు - హృద్రోగ నివారణ, హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్, అధిక కొలెస్ట్రాల్, హైపర్ టెన్షన్, కరోనరీ ఆర్టరీ డిసీజ్, పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ వంటి గుండె సంబంధిత వ్యాధులన్నీ ఎప్పుడైనా, ఎవరికైనా వచ్చే అవకాశం ఉన్నదని చెప్పారు. అయితే ఆ వ్యాధులను అడ్డుకునే మార్గాలు కూడా ఉన్నాయన్నారు. మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రణలో పెట్టుకోవాలన్నారు. ధూమపానం మానేయాలని, రోజుకు 30 నిముషాలు లేదా వారంలో 150 నిముషాలు శారీరక శ్రమ, వ్యాయామం చేయడంవల్ల ఆరోగ్యం, పనితీరు పెరిగి గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. అనస్థీషియస్ట్ డాక్టర్ పి.భరత్, కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, విభాగాధిపతి కోదండరామయ్య, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి మాధవన్, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ మహేశ్, కేఈసీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ గంగాధరన్, పీఆర్వో ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలి



గ్రంథాలయంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయులు

పుంగనూరు, ఆగస్టు 29: తెలుగుభాష గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాల్సిన బాధ్యత తెలుగువారిపై ఉందని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ పేర్కొన్నారు. తెగులు మాతృభాషా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా విద్యార్థులకు తెలుగుభాషకు ఉన్న ప్రముఖ్యత గురించి వివరించారు. అధ్యాపకులు అనిల్‌కుమార్, సోమరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక గ్రంథాలయంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, రెడ్డెప్ప యాదవ్, గ్రంథాలయాధికారి తులసి నాయక్, రామలింగప్ప, పగడాల రమణ, మురళీధర్, నసీబ్‌జాన్, పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ఎన్టీఆర్ సంజీవని మొబైల్ క్లినిక్ శ్రీరామరక్ష



వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఆగస్టు 29: నియోజక వర్గ ప్రజారోగ్యానికి ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్టీఆర్ సంజీవని మొబైల్ క్లినిక్, ఆరోగ్య కేంద్రాలు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. నియోకజవర్గ పరిధిలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మొబైల్ క్లినిక్ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా కుప్పంలోని క్లినిక్‌లో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సంర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల మాట్లాడుతూ 2023 ఆగస్టు 29న ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించిన ఎన్టీఆర్ ఆరోగ్య కేంద్రం, ఎన్టీఆర్ ఆరోగ్య రథాల ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతమైన వైద్య సేవలు ప్రజలకు అందించామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామాలలో 298 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, 26,290 మంది ప్రజలకు రూ.64,76,474 విలువ కలిగిన మందులు పంపిణీ చేశామన్నారు. అలాగే కుప్పంలోని ఎన్టీఆర్ ఆరోగ్య కేంద్రం ద్వారా 291 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి 17,491 మందికి రూ.33,75,455 విలువ కలిగిన మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే నారా భువనేశ్వరి ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ నియోజకవర్గ విస్తరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వైద్యులు, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించండి



మంత్రికి బుక్‌లెట్‌ను చూపుతున్న ఎస్‌కే

చౌడేపల్లె, ఆగస్టు29: పుంగనూరు నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పుంగనూరు బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్‌కే వెంకటరమణారెడ్డి కోరారు. గురువారం ఆయన అమరావతిలో మంత్రిని కలసి పుంగనూరు నియోజకవర్గంలోనే కాకుండానే ఇతర నియోజక వర్గాలలో తాను చేసి ఆలయాల అబివృద్ధి బుక్‌లెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి తనకు సహకరిస్తే నియోజకవర్గంలోని ఆలయాలను మరింత అభివృద్ధి చేస్తానని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఆయన వెంట రాష్ట్రతెలుగు రైతు అధికార ప్రతినిధి సోమల సురేష్ తదితరులు ఉన్నారు.

మూత బడ్డ భవిత కార్యాలయం



సోమల, ఆగస్టు 29: సోమల మండల కేంద్రంలో దివ్యాంగ పిల్లల కోసం నిర్మించిన భవిత కార్యాలయం ఆరు నెలలుగా మూత పడింది. ప్రతి సోమవారం పిల్లల వైద్యసేవల అందించేందుకు ప్రభుత్వం ఫిజియోథెరపిస్టును నియమించింది. అయితే ఫిజియోథెరపిస్టుకు సక్రమంగా జీతాలు అందకపోవడంతో సేవలు అందించడం లేదు. ఫలితంగా కార్యాలయం మూత పడింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సోమల, ఆగస్టు 29: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని సోమల టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. గురువారం కందూరు సచివాలయంలో పలువురు ఆయనకు పలు సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్‌తో అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బీ.శ్రీనివాసులు, టీ.శ్రీనివాసులు, సత్యనారాయణ, సుబ్బరాయుడు, బాలకృష్ణమనాయుడు, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బోయపల్లెలో పాలేటమ్మ ఊరేగింపు

సోమల, ఆగస్టు 29: మండలంలోని నెల్లిమంద పాలేటమ్మవారి మలిజాతర నేపథ్యంలో గ్రామోత్సవాల సందర్భంగా అమ్మవారి ఉత్సమూర్తిని గురువారం కంచెంవారిపల్లె, బోయపల్లె, చింతలవారిపల్లెల్లో ఊరేగించారు. ఈ పూజల్లో సతీశ్, ఈశ్వర్ యాదవ్, గుర్రప్ప నాయుడు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల పరామర్శలు

సోమల, ఆగస్టు 29: సోమల వైసీపీ నాయకుడు జి.సాంబయ్య కుమారుడు మోహన్‌కుమార్ గురువారం మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని పుంగనూరు, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, పెద్దిరెడ్డి, సుధీర్‌రెడ్డి పలువురు వైసీపీ నాయకులు పరామర్శించారు. ● అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న సింగిల్ విండో మాజీ ఛైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావును పరామర్శించారు.

తెలుగు కమ్మనైన భాష

పలమనేరు, ఆగస్టు29 : తెలుగు ఎంతో కమ్మనైన భాష అని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ బాబు అన్నారు. పలమనేరులో గురువారం గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ బాబు అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగు విభాగాధిపతి వాసు మాట్లాడుతూ తెలుగు భాషలోని మాధుర్యాన్ని పరదేశీయులు సైతం కీర్తించారని అయితే మనం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. అనంతరం వివిధ అం శాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, డాక్టర్ కేవీ చిదంబరం, డాక్టర్ వెంకటేష్‌బాబు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే సంప్రదాయ దుస్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని వివిధ పాఠశాలల్లో తెలుగుభాష, క్రీడాదినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగుభాష ఔన్నత్యం గురించి హెచ్‌ఎం నసీబ్‌జాన్ విద్యార్థులకు వివరించారు. తెలుగుభాష ప్రాముఖ్యతపై వ్యాసరచనపోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమ తులందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ మణికంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● తీర్థం జడ్పీఉన్నత పాఠశాలలో కూడా తెలుగుభాష, క్రీడా దినోత్సవ సంబరాలు చేపట్టారు. ఈ కార్య క్రమంలో హెచ్‌ఎం రత్నమ్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ మోహన్ కుమార్, సీఆర్పీ షాబుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమల: తెలుగు భాషా దినోత్సవం గురువారం నంజంపేట, కందూరు, సూరయ్యగారిపల్లె, సోమల, పెద్దఉప్పరపల్లె ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషకు చిహ్నంగా బాల బాలికలు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో అష్టావధానం చేపట్టారు. అలాగే క్రీడా దినోత్సవ పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు బీ. కుసుమాంబ, నిరంజన్‌కుమార్, వసంతకుమారి, శ్రీదేవి, స్వాతి, మోహన్‌రెడ్డి, శివరాజ, వాసు, షకీల్, విద్యావతి, సూర్యప్రకాశ్, కుసుమ పాల్గొన్నారు.

కల్లూరు: తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమానికి శ్రీకారం చుట్టి బడి పిల్లలకు వాడుక భాషలో పాఠాలు చెప్పాలనే ఉద్యమాన్ని గిడుగు రామమూర్తి ముందుకు తీసుకెళ్లారని పాఠశాల హెచ్‌ఎంలు శ్రీవాణి, మంజువాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు, కావేటిగారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొరస్వామి, వెంకట సిద్ధులు, రాజేంద్ర, ఈశ్వరయ్య, కాటయ్య, కిరణ్మయి, అమృతవల్లి, రహమత్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

సదుం: మాతృభాషపై పట్టే ప్రతి విద్యార్థికీ తన జీవితంలో విద్యకు తొలి మెట్టు అవుతుందని సదుం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో తెలుగు భాషా పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక హైస్కూల్ విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. బస్టాండులో మనవహారం నిర్వహించారు. హెచ్‌ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు మురళి, రాజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.






పలమనేరులో నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు ● తీర్థం జడ్పీఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణతో ఆకట్టుకున్న విద్యార్థిని, కల్లూరు ఉన్నత పాఠశాలలో వివిధ వేషధారణతో ఆకట్టుకుంటున్న విద్యార్థులు, చౌడేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

గురుకుల పాఠశాలలో మౌలిక వసతులకు కృషి


బాస్కెట్‌బాల్ ఆడుతున్న ఎంపీ దగ్గుమళ్ల

చిత్తూరు, ఆగస్టు 29: ఎస్టేట్‌లో ఉన్న గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టును ఎంపీ ప్రారంభించారు. కొంతసేపు పిల్లలతో కలిసి సరదాగా బాస్కెట్‌బాల్ ఆడారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రహరీగోడ, మరుగుదొడ్ల వసతి కల్పించాలని కోరారు. ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న రామచంద్రారెడ్డి

తవణంపల్లె, ఆగస్టు 29: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఆదనపు మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ అధికారి పీర్ సాహెబ్ అన్నారు. మండలంలోని మోదలపల్లె, టి.పుత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బందితో కలిసి దోమల వల్ల వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణ చర్యలు చేపట్టారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు.

సక్కుబాయమ్మకు నివాళి



విజయపురం, ఆగస్టు 29: జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయ యాదవ్ తల్లి సక్కుబాయమ్మకు గురువారం పలువురు టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో టీడీపీ నేతలు చినబాబు, బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, గుణభూషణమ్మ, చిన్నబ్బరాజు, సుధాకర్‌రాజు, దశరథరాజు, మురళి, మహేంద్ర, అశోక్, కపిల్, శరత్, హరికృష్ణ, శివలింగం ఉన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు



నింద్ర, ఆగస్టు 29: నింద్రలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. సాయంత్రం యువత ఆధ్వర్యంలో ఉట్లోత్సవం నిర్వహించారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్



నగరి, ఆగస్టు 29: నగరి డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు ఉపాధ్యాయ పోస్టులకు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు గురువారం వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌జీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజన్ పరిధిలోని మిగులు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బయాలజికల్ సైన్స్ ఒకటి, ఇంగ్లీషులో నాలుగు ఖాళీలను భర్తీ చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, చిత్తూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థి చిత్తూరు, లాలా గార్డెన్,డో.నెం. 15-1581/ఓ లో కాపురముండు ఎం.అబిద్, తండ్రి లేట్ హాస్సేన్ గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు ఎం.అబిద్ గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఏటువంటి జప్తులు, దార్లీలు, క్రయములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 5 దినములలోగా ఈ క్రింద చూపిన చిరు నామాకు వ్రాత పూర్వకముగా తెలియ జేయగలరు. తదు పరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు. **షెడ్యూలు ఆస్తి వివరము :** చిత్తూరు డిస్ట్రిక్టు చిత్తూరు సబ్ డిస్ట్రిక్టు చిత్తూరు మండలం – చిత్తూరు మునిసిపాలిటీ, నెం. 72 చిత్తూరు గ్రామం లెక్క దాఖలా సర్వే నెం. 231 గల భూమిలో చిత్తూరు టౌన్, శంకరయ్యగుంట డోర్ నెం. 15-3212/1 గాగల RCC మిద్దె ఇంటికి, తాగాకు చెక్కుబంది. **కొలతల వివరము :** తూర్పు మేరీ గారికి చెందిన 15-3211 (Part) ఇల్లు మరియు చెంగల్రాయన్ గారికి చెందిన డోర్ నెం. 15-3213 గాగల ఇల్లు పడమర మల్లిక గారికి చెందినదిగా యుండి ఈదినం మీపు విక్రయం పొందిన లాగా ఉత్తరం : దారి, దక్షిణం రోడు :4. ఈమధ్య రోడు నుండి 1వ కొలత తూర్పు పడమర 16.1/4 అడుగులు లేక 4.940 మీటర్లు, ఉత్తర దక్షిణం 26.1/2 అడుగులు లేక 8.056 మీటర్లు, ఈ కొలతల మధ్య 430.625 చదరపు అడుగులు లేక 48 చదరపు గజములు గల జాగా పూరాయున్న. ఇందుకు ఉత్తరముగా **2వ కొలత :** తూర్పు పడమర 27 అడుగులు లేక 8.208 మీటర్లు, ఉత్తర దక్షిణం 23 అడుగులు లేక ఈ కొలతల మధ్య 621 చదరపు అడుగులు లేక 69 చదరపు గజములు గల జాగా పూరాయున్న. ఇందుకు ఉత్తరముగా ఈశాన్యదిశన **3వ కొలత:** తూర్పు పడమర 4.112 అడుగులు లేక 1.368 మీటర్లు, ఉత్తర దక్షిణం 7.1/2 అడుగులు లేక 2.280 మీటర్లు, ఈ కొలతల మధ్య 33.3/4 చదరపు అడుగులు లేక 4 చదరపు గజములు గల దాగా పూరాయున్న. పైజూపిన 3 కొలతల మొత్తం విస్తీర్ణము 1085.375 చదరపు అడుగులు లేక 121 చదరపు గజములు గల తాగా పూరాయున్న. పై జాగాలలో తూర్పు పడమర 27 X ఉత్తర దక్షిణం 23 = 621 చదరపు అడుగులు విస్తీర్ణములో గల RCC మిద్దె ఇల్లు పూరాయున్న. ఈ ఇంటికి అమర్చియుండు తలుపులు, ద్వారబంధనములు, కిటికీలు, అల్మైరాలు, అడుగునేల, వైర్లు, గోడలు వగైరాలు పూరా. ఈ ఇంటికి అమర్చియుండు కరెంటు సర్వీసు, కనెక్షన్ నెం.2888 పూరా.

కె.ప్రవీణ్, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం. 19-115, గాంధీ రోడ్ ఎక్స్‌టెన్షన్, చిత్తూరు సెల్ : 9650134766

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



వెదురుకుప్పం, ఆగస్టు 29: ఇసుక అక్రమంగా తరలిస్తున్న కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటకు చెందిన రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. వాటిని తహసీల్దార్‌కు అప్పగించినట్లు చెప్పారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

చిత్తూరు కల్చరల్ : సాంబయ్యకండిగలోని షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఓఎంఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఓ.ఎం.రాందాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాగడ హారతి, అభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజ హోమంతో పూర్ణాహుతి నిర్వహించారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌నాయుడు, గిరింపేట దుర్గమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ వి.కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 29: హైరోడ్డు శ్రీకృష్ణ మందిరంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. చర్చివీధి రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలోనూ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, పుష్పాభిషేకం నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీఈవో

నగరి, ఆగస్టు 29 : నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌జీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ మెనూ ప్రకారం పెడుతున్నారా.. లేదా.. అని ఆరా తీశారు. నాణ్యమైన భోజనం పెట్టాలని అధికారులకు సూచించారు. నగరి, పాలసముద్రం ఎంఈవోలు శ్రీదేవి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన



పూతలపట్టు, ఆగస్టు 29: పూతలపట్టు చెరువు వద్ద నూతనంగా నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులను ఎంపీడీవో ధనలక్ష్మి గురువారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి ఆమె వెంట ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను వాడుకోండి


హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ధనలక్ష్మి

పూతలపట్టు, ఆగస్టు 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ధనలక్ష్మి కోరారు. గురువారం ఆమె మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. వేనూతనపల్లెలో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



పూతలపట్టు, ఆగస్టు 29: పూతలపట్టు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా కృష్ణమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుదర్శనప్రసాద్ బదిలీపై వీఆర్‌కు వెళ్లడంతో వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్ ఇక్కడికి వచ్చారు.

క్షయవ్యాధి నివారణకు కలిసి రావాలి


వ్యాక్సిన్ వేసుకుంటున్న తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి

గుడిపాల, ఆగస్టు 29: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో క్షయ వ్యాధి నివారణపై వైద్యాధికారిణి డాక్టర్ సంధ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. క్షయ నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అధికారులు వివరించారు. అనంతరం పలువురికి అడల్ట్ వ్యాక్సినేషన్ వేశారు. ఎంఈవో గణపతి, డిప్యూటీ తహసీల్దారు వంశీకృష్ణ పాల్గొన్నారు.

బస్సులు ఢీ : స్తంభించిన ట్రాఫిక్



గుడిపాల, ఆగస్టు 29: బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నంగమంగళం వద్ద రహదారి పనులు నత్తనడకన సాగడంతో వాహనాలను పల్లూరు మట్టం నుంచి చింతగుంటూరు, బొమ్మసముద్రం, పోటూరు మీదుగా చిత్తూరుకు మళ్లించారు. గురువారం చింతగుంటూరు వద్ద ఎదురెదురుగా వస్తున్న బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం తప్పినా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించాల్సి వచ్చింది. ఇప్పటికైన అధికారులు వెంటనే స్పందించి జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే ఈ ప్రాంతంలో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

బంగారుపాళ్యం, ఆగస్టు 29: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు గాయపడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యాదమరి మండలం బలిజపల్లి ఎస్టీకాలనీకి చెందిన రవి ద్విచక్ర వాహనంలో కేజీ సత్రం వైపు వెళుతుండుగా పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



విజయం స్కూల్లో చిన్నారుల వేషధారణ - బృందావనం స్కూల్లో చిన్నారులతో ఉపాధ్యాయ బృందం

చిత్తూరు (సెంట్రల్)/ చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 29: తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతుల్లో ఆలోచించిన తొలి భాషా జ్ఞాని గిడుగు రామమూర్తి పంతులని డీఆర్వో పుల్లయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కౌన్సిల్ హాలులో డ్వామా పీడీ రాజశేఖర్‌తో కలిసి గిడుగు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కలెక్టరేట్ ఏవో కులశేఖర్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎల్‌డీవో రవికుమార్, విద్యుత్ శాఖ ఈఈ హరి పాల్గొన్నారు. నగరంలోని పలు పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు చేసిన సేవలను కొనియాడారు. సుందరరాజపురం విజయం సీబీఎస్ఈ స్కూల్లో డైరెక్టర్ శైలజామూర్తి ఆధ్వర్యంలో చిన్నారుల కవుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగు కవితలు, గీతాలు, కీర్తనలు ఆటపాటలతో అలరించారు. బృందావనం పాఠశాలలో వ్యవస్థాపకుడు విజయభాస్కర్, కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆధ్వర్యంలో భువన విజయం, తండ్రిపై ప్రేమ తదితర నాటికలతో పాటు కవుల వేషధారణలో చిన్నారులు అలరించారు. పీవీకేఎన్ కళాశాలలో తెలుగు విభాగం, హరివిల్లు లలితకళా వేదిక సంయుక్తంగా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, ప్రదర్శన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రామ విలాస సభలో సాహితీవేత్తలతో కవి సమ్మేళనం, విద్యార్థులకు వ్యాస, వృక్తత్వ, సంగీత పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

నగరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండల వనరుల కేంద్రం, పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈవో దేవరాజులు పాల్గొని మాతృభాష ఔన్నత్యాన్ని, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని, దాన్ని నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయ పాల్గొన్నారు.

విజయపురం : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జీఎంపురంలో చంద్రయ్య నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తవణంపల్లె : తవణంపల్లె ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూజలు చేసి, మాలలు వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో హేమలత పాల్గొన్నారు.

వెదురుకుప్పం : కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిడుగు ఉద్యమ చరిత్రను తెలుగు ఉపాధ్యాయులు చిన్నయ్యశెట్టి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం, పరమానందయ్య శిష్యుల కథ, దుర్యోధన ఏకపాత్రాభినయం నాటికలు ఆకట్టుకున్నాయి. తెలుగు అక్షర కిరీటధారణ అలరించింది. పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ త్యాగరాజు విద్యార్థులకు బహుమతులు అందించారు. కొల్లాగుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వెదురుకుప్పం మండలంలోని పలు పాఠశాలల్లో జరుపుకున్నారు.


నగరిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్


విజయపురంలో విద్యాసామగ్రి పంపిణీ


తవణంపల్లెలో మాట్లాడుతున్న ఎంఈవో హేమలత

గుడిపాల : మండలంలోని సీఎన్ఆర్ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. తహసీల్దారు చంద్రశేఖర్ తెలుగుభాషకు గిడుగు చేసిన సేవలను కొనియాడారు. కరస్పాండెంట్ లోకేష్ ఎన్ఎస్ఎస్ అధికారి అర్జున్, ప్రిన్సిపాల్ రామచంద్ర పాల్గొన్నారు.

నింద్ర : నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్య అతిథిగా విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు, పాఠ్యపుస్తక రూపకర్త పురుషోత్తమాచారి హాజరయ్యారు. గిడుగు రామ్మూర్తి గురించి వివరించారు. పురుషోత్తమాచారిని సన్మానించారు. ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు.

పారిశ్రామిక వృద్ధికి సహకరించండి


మంత్రితో చర్చిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 29 : నగరి నియోజకవర్గంలో పరిశ్రమల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కోరారు. అమరావతిలో గురువారం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే విజయపురం మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న సానుకూలతలను వివరించారు. అలాగే నగరి, వడమాలపేట మండలాల్లో ఏపీఐఐసీ భూములను సేకరించి ఉన్నందున పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

రహదారి నిర్మాణానికి రూ.10కోట్లు ఇవ్వండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

యాదమరి, ఆగస్టు 29: చిత్తూరు-గుడియాత్తం రోడ్డు నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ కోరారు. ఈ మేరకు గురువారం వెలగపూడిలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి కావడంతో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, రోడ్డంతా గుంతలమయం కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారు.

సన్‌గోల్డ్ ఫ్యాక్టరీని సందర్శించిన దగ్గుమళ్ల


జామ పల్ప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల

బంగారుపాళ్యం, ఆగస్టు 29: మండలంలోని నలగాంపల్లి వద్ద గల సన్‌గోల్డ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని గురువారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సందర్శించారు. మామిడి, జామ, ద్రాక్ష పండ్ల రసాల ప్రాసెసింగ్ గురించి మేనేజర్ ధనుంజయ నాయుడు, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ పోసాని అరుణను అడిగి తెలుసుకున్నారు. పల్ప్ టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించి జామ, మామిడి రసాలను రుచి చూశారు. అంతకుముందు ఎంపీ మండలంలోని కేఎం కండ్రిగ పంచాయతీని సందర్శించారు. లక్ష్మీపురం నుంచి రెండు కి.మీ మేర రోడ్డు ఫారెస్టు ఆధీనంలో ఉండడంతో కంతలచెరువుకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎంపీకి విన్నవించారు. రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీప్రసాద్ నాయుడు, సౌందర్‌రాజ్ పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే ముందడుగు



సమావేశంలో ప్రసంగిస్తున్న సెట్విన్ అధికారి మురళీకృష్ణ

నగరి, ఆగస్టు 29: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే దేశం ముందడుగు వేస్తుందని సెట్విన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. సెట్విన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు చేసిన నవకల్పనల గురించి వివరించారు. వ్యవసాయ రంగంలో వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే ఆహార స్వయం సమృద్ధి సాధ్యమవుతోందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. విద్యుత్ వాహనాలు, రోబోల వినియోగం ద్వారా మానవ జీవితం సులభతరం, సుఖవంతం అవుతోందని వివరించారు. సమన్వయకర్త రమేష్, సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్, డాక్టర్ సుహాసిని, డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



సేనాధిపతి తిరువీధి ఉత్సవంలో ఆలయాధికారులు - అంకురార్పణ చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం, ఆగస్టు 26: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు గురువారం ఆలయాధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పూజాది కార్యక్రమాలు చేశారు. శుద్ధి, తోమాల, కొలువు, పంచాగశ్రావణం, అర్చన కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఆచార్య ఋత్విక్వరణం నిర్వహించారు. శుద్ధి, సర్వదర్శనం వసతి కల్పించారు. సాయంత్రం పూజా కార్యక్రమాలను నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. మత్సగ్రహణం, సేనాధిపతి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రికి ఏకాంత సేవ చేయించారు. ప్రధాన అర్చకులు గోపాల ఆచార్యులు, శబరి, రమేష్ హాజరయ్యారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి


మామిడి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బంగారుపాళ్యం, ఆగస్టు 29: మామిడిలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ వసంత, డాక్టర్ నాగమణి అన్నారు. మండలంలోని జయంతి గ్రామానికి చెందిన వీరమ్మ మామిడి తోటలో గురువారం మామిడి పంటపై మెలకువలు, రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ జూన్, జూలై నెలలో కురిసిన వర్షాలకు మామిడి పంటలో కొత్త చిగురు రావడం జరుగుతుందని, ఆ ఆకులపైన తేనెమంచు పురుగు ఆశించి రసం పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోతాయని, కొమ్మలపై బంక కారుతూ తెగులు ఆశిస్తుందని అన్నారు. వ్యవసాయాధికారితో సంప్రదించి మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు నాగపద్మిని, లక్ష్మీప్రసన్న, ఏవో చిట్టిబాబు, సర్పంచ్ శ్రీనివాసులు, ఉద్యానశాఖ అధికారిణి సాగరిక, విస్తరణాధికారి సాదరయ్య పాల్గొన్నారు.

భారత హాకీ శిఖరం ధ్యాన్‌చంద్


దుర్యోధన వేషధారణతో హాకీ ఆడుతున్న విద్యార్థి

వెదురుకుప్పం, ఆగస్టు 29: ప్రపంచ హాకీ మాంత్రికుడు, భారత హాకీ శిఖరం ధ్యాన్‌చంద్ అని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు కొనియాడారు. గురువారం ఆ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దుర్యోధన వేషధారి ధరణికుమార్ హాకీ క్రీడ ఆడి అలరించారు. వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, ఆగస్టు 29: కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్రం అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.స్వరూప గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పెనుమూరులో అల్లరిమూకల ఆగడాలు

పెనుమూరు, ఆగస్టు 29: మండల కేంద్రమైన పెనుమూరులో అల్లరి మూకల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బస్టాండు కేంద్రంగా అల్లరి చేష్టలు చేస్తూ అక్కడికి వచ్చే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. భారీ శబ్దాలతో ద్విచక్ర వాహనాలతో రైడ్ చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలలకు, కళాశాలలకు వచ్చే బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఉదయం, సాయంత్రం బస్టాండు వద్ద కాపుకాసి ఇబ్బంది పెడుతున్నారు. పైగా మండల పరిధిలో ఇటీవల బాలికల మిస్సింగ్ కేసులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో బాలికలను కళాశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం, బస్టాండు, కూడళ్లు, ఆటోస్టాండ్ వద్ద ఉదయం, సాయంత్రం గస్తీ నిర్వహిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. సచివాలయాల్లోని మహిళా పోలీసులు గ్రామాలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.